# ఆకలితో అవస్థలు పడే వృద్ధులకు అంగన్వాడి కేంద్రాలు ఆశాకిరణం కావాలి

**•వ్యాసకర్త: బస్కీ నాయక్**

మన సమాజంలో చిన్నపిల్లల ఆరోగ్యం, పౌష్టికాహారం కోసం ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా అనేక సేవలు అందిస్తోంది. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, విద్య, ఆరోగ్య పరిరక్షణ అందించడం నిజంగా అభినందనీయం. ఎందుకంటే ఒక చిన్నారి ఆరోగ్యంగా పెరిగితేనే దేశ భవిష్యత్తు బలపడుతుంది.

అయితే ఇదే సమయంలో మన కళ్లముందు మరో బాధాకరమైన వాస్తవం కూడా కనిపిస్తోంది. ఎన్నో పేద కుటుంబాల్లో ఉదయం పని కోసం వెళ్లే వారు ఇంట్లో కూర వండుకునే పరిస్థితి లేక వట్టి అన్నం కట్టుకొని పనికి వెళు_న్నారు. కొందరు నూనె కారం, ఉప్పు, నీరు లేదా పెరుగుతో ఒక పూట గడిపేస్తున్నారు. ఇంట్లో వృద్ధులు ఉంటే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. కూరలు లేకపోతే నీళ్లు పోసుకొని అన్నం తినడం, పాత కారం వేసుకొని ఆకలి మంట ఆర్పుకోవడం వంటి దృశ్యాలు ఇంకా గ్రామాల్లో, పట్టణాల పేద బస్తీల్లో కనిపిస్తున్నాయి.

వృద్ధాప్యం అనేది మనిషి జీవితంలో అత్యంత బలహీనమైన దశ. ఈ దశలో శరీరానికి పోషకాహారం అత్యంత అవసరం. కానీ ఎంతోమంది వృద్ధులకు సరైన ఆహారం దొరకడం లేదు. చేతులు పనిచేయవు, సంపాదించే శక్తి ఉండదు, కుటుంబ సభ్యులపై ఆధారపడాల్సి వస్తుంది. కొందరికి పిల్లలు ఉన్నా పట్టించుకోరు. మరికొందరికి ఎవరూ ఉండరు. చివరికి ఆకలితో, అనారోగ్యంతో, అవస్థలతో జీవితం ముగుస్తోంది.



రాజ్యాంగం ప్రతి మనిషికి గౌరవప్రదమైన జీవితం హక్కుగా ఇచ్చింది. "ఎవ్వరూ ఆకలితో చావకూడదు" అనే భావన ఒక ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు --- అది మానవత్వానికి సంబంధించిన విలువ. చిన్నపిల్లల ఆరోగ్యం ఎంత ముఖ్యమో, వృద్ధుల గౌరవప్రదమైన జీవితం కూడా అంతే ముఖ్యమైనది.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఒక మానవతా దృక్పథంతో ఆలోచించాల్సిన అవసరం ఉంది. ప్రతి గ్రామంలో ఉన్న అంగన్వాడి కేంద్రాలను వృద్ధులకు కూడా ఆహార భద్రత కల్పించే కేంద్రాలుగా మార్చాలి. ముఖ్యంగా పేదరికంలో ఉన్న, ఒంటరిగా జీవిస్తున్న, ఆహారం దొరకని వృద్ధులకు రోజుకు కనీసం ఒక పూట అయినా పౌష్టికాహారం అందించే విధానం తీసుకురావాలి.

వృద్ధాప్య పెన్షన్ తీసుకుంటున్న వారిలో నిజంగా ఆహార సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చి అంగన్వాడి కేంద్రాల ద్వారా భోజనం అందించవచ్చు. అన్నం మాత్రమే కాదు --- పప్పు, కూరగాయలు, గుడ్లు, పెరుగు వంటి పోషకాహారం అందిస్తే వారి ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఆకలితో, నిర్లక్ష్యంతో మరణించే పరిస్థితులు తగ్గుతాయి.

ఇది కేవలం భోజనం పెట్టడం కాదు...

ఒక వృద్ధుడికి "నువ్వు ఒంటరివి కావు" అని చెప్పే మానవత్వపు హామీ.

ఇది కేవలం సంక్షేమ పథకం కాదు...

మన సంస్కృతి, మన విలువలు ఇంకా బతికే ఉన్నాయని నిరూపించే చర్య.

చిన్నపిల్లలకు అంగన్వాడి కేంద్రాలు ఎలా ఆశాకిరణంగా మారాయో, అలాగే వృద్ధులకు కూడా ఆ కేంద్రాలు ఆదరణ నిలయాలుగా మారాలి. చివరి దశలో ఉన్న మనుషులు ఆకలితో కాకుండా గౌరవంతో, సంతృప్తితో జీవితం గడపాలి. అదే నిజమైన అభివృద్ధి. అదే మానవత్వం గెలిచిన సమాజం.

# లివర్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

**•ఫ్యాటీ లివర్, హెపటైటిస్‌తో క్యాన్సర్ ప్రమాదం పెరుగుతోంది**

**•ముందస్తు పరీక్షలతో ప్రాణాలు కాపాడుకోవచ్చు.**

**సంగారెడ్డి, మే 28,మన మహతి న్యూస్ :**

ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న క్యాన్సర్లలో లివర్ క్యాన్సర్ ఒకటిగా మారుతోందని యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీకి చెందిన ప్రముఖ సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, లివర్ స్పెషలిస్ట్ డాక్టర్ నవీన్ పోలవరపు తెలిపారు. సంగారెడ్డిలో నిర్వహించిన ప్రత్యేక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఫ్యాటీ లివర్, హెపటైటిస్ బి, సి వైరస్‌లు, అధిక మద్యపానం వంటి కారణాలతో లివర్ తీవ్రంగా దెబ్బతింటోందన్నారు. లివర్ డ్యామేజ్‌ను "సైలెంట్ కిల్లర్"గా అభివర్ణిస్తూ, కాళ్లు వాపులు, పొట్ట ఉబ్బరం, లివర్ క్యాన్సర్ వంటి లక్షణాలు బయటపడే వరకు చాలా మందికి వ్యాధి ఉన్న విషయం తెలియదన్నారు. అప్పటికే వ్యాధి ముదిరిపోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు.




లివర్ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే క్రమం తప్పకుండా రక్తపరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవాలని సూచించారు. హెపటైటిస్ బి, సి వైరస్‌లు చాలామందికి తెలియకుండానే శరీరంలో ఉండి క్రమేపీ లివర్‌ను దెబ్బతీస్తాయని తెలిపారు. ముందుగానే పరీక్షల ద్వారా గుర్తిస్తే వ్యాక్సినేషన్, చికిత్సలతో ప్రమాదాన్ని తగ్గించవచ్చున్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) 2030 నాటికి హెపటైటిస్ నిర్మూలన లక్ష్యంగా చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఫ్యాటీ లివర్ నివారణకు కొలెస్ట్రాల్, డయాబెటిస్, థైరాయిడ్ సమస్యలను అదుపులో ఉంచుకోవాలని సూచించారు.

అధిక మద్యపానం వల్ల ప్యాంక్రియాటైటిస్ వచ్చే ప్రమాదం ఉందని, ఇది ప్రాణాంతకంగా మారే అవకాశం కూడా ఉంటుందని హెచ్చరించారు. మద్యపానం తగ్గించడం లేదా పూర్తిగా మానేయడం ద్వారా లివర్, ప్యాంక్రియాస్ దెబ్బతినకుండా కాపాడుకోవచ్చున్నారు.

అనారోగ్యకరమైన ఆహార అలవాట్ల వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు, జీర్ణకోశ సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. మలవిసర్జనలో మార్పులు, మోషన్‌లో రక్తం పడటం, పొట్ట ఉబ్బరం వంటి లక్షణాలు రెండు వారాలకు మించి కొనసాగితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

కొలనోస్కోపీ ద్వారా పేగుల్లోని పాలిప్స్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి తొలగించడం ద్వారా పెద్దప్రేగు క్యాన్సర్‌ను నివారించవచ్చున్నారు. పాశ్చాత్య దేశాల్లో కొలనోస్కోపీపై అవగాహన పెరగడంతో పెద్దప్రేగు క్యాన్సర్ కేసులు గణనీయంగా తగ్గాయని వివరించారు.

ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీకి చెందిన డాక్టర్ నవీన్ పోలవరపు, కార్పొరేట్ రిలేషన్స్ ఆఫీసర్ మహేష్, సంగారెడ్డి అధికారి గోపాల్ పాల్గొన్నారు.

# రోడ్డుపైనే మురుగునీరు.. నరకప్రాయంగా మహాలక్ష్మి నగర్!

**•అనుమతులపై మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం?**

**•పట్టించుకోని వైనం.. స్థానికుల ఆగ్రహం**

**మన మహతి న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ నాగారం, మే 28**

ఘట్కేసర్ సర్కిల్ నాగారం మున్సిపాలిటీ పరిధిలోని మహాలక్ష్మి నగర్ (సర్వే నెంబర్ 402) కాలనీవాసులు డ్రైనేజీ సమస్యతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాలనీలోని రోడ్లన్నీ మురుగునీటితో చెరువులను తలపిస్తున్నాయి. ఒక బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్‌తో పాటు, మరో నాలుగు ఇండిపెండెంట్ ఇళ్లకు సంబంధించిన డ్రైనేజీ నీటిని నేరుగా రోడ్డుపైకే వదలడంతో ఈ పరిస్థితి దాపురించింది. దీనివల్ల స్థానిక ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అనుమతులు ఎలా ఇచ్చారు? కనీస సదుపాయాలు, డ్రైనేజీ వ్యవస్థ లేకుండా ఒక బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్‌కు, అలాగే నియమ నిబంధనలు పాటించని ఇండిపెండెంట్ ఇళ్లకు స్థానిక మున్సిపల్ అధికారులు ఏ రకంగా అనుమతులు ఇచ్చారని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఇంత భారీ ఎత్తున నిర్మాణాలు జరుగుతున్నా, డ్రైనేజీ నీరు



రోడ్లపైకి వస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, వారి చోద్యం వెనుక అసలు రహస్యం



ఏంటని స్థానికులు మండిపడుతున్నారు.

పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ.. సమస్యలపై లేదా? "సమయానికి ఇంటి పన్నులు, నీటి పన్నులు వసూలు చేయడంలో చూపిస్తున్న శ్రద్ధను, కనీస సౌకర్యాలు కల్పించడంలో ఎందుకు చూపించడం లేదు? మేము కట్టే పన్నుల డబ్బులు దేనికోసం వాడుతున్నారు?" అంటూ స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటి వల్ల దోమలు చేరి, అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై అధికారులకు పలుమార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని మహాలక్ష్మి నగర్ కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

# ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్ ఐఎఎస్ ను మర్యాదపూర్కును కలిసిన చీఫ్ ఇంజనీర్ మాలోత్ బాలు

**మన మహతి న్యూస్ భద్రాచలం**

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్ ఐఎఎస్ ను గిరిజన ఇంజినీరింగ్ శాఖ చీఫ్ ఇంజనీర్ మాలోత్ బాలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి రాహుల్ ఖుం మాట్లాడుతూ ప్రాజెక్ట్ పరిధిలో మంజూరైన బీటీ రోడ్లు, పంచాయతీ భవనాలు, విద్యాసంస్థల మౌలిక సదుపాయాలు, గిరిజన భవనాల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనల ఫోటోలను అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో తప్పనిసరిగా అప్లోడ్ చేయడంతో పాటు రోజువారీ టూర్ డైరీలను ప్రతి




నెల సమర్పించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల ఆదేశాల అమలులో అలసత్వం ప్రదర్శించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనంతరం చీఫ్ ఇంజనీర్ మాలోత్ బాలు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని వీడి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిపోర్టులు, ఎస్టిమేట్లు సకాలంలో సిద్ధం చేయాలని సూచించారు. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన పెంచుకుని గిరిజనాభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ ఉద్యోగులకు సూచన చేసిన ప్రధాన ఇంజనీర్ మాలోత్ బాలు .

## భూమి భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: డాక్టర్ మీరా హుస్సేన్

**మన మహతి న్యూస్ మణుగూరు**

ప్రస్తుతం నమోదవుతున్న అత్యధిక ఉష్ణోగ్రతలు, భవిష్యత్తులో మానవ మనుగడకు ముప్పుగా మారే ప్రతికూల వాతావరణ పరిస్థితులకు భూమిపై అటవీ శాతం తగ్గిపోవడమే ప్రధాన కారణమని లయన్స్ క్లబ్ మణుగూరు అధ్యక్షుడు, ప్రాథమికోన్నత పాఠశాల కూనవరం ప్రధానోపాధ్యాయులు, ఖమ్మం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ షేక్ మీరా హుస్సేన్ పేర్కొన్నారు.



రాబోయే కాలంలో భూగోళం మరింత వేడెక్కి ప్రాణికోటికి మనుగడ కష్టతరమయ్యే ప్రమాదం ఉందన్నారు. చెట్ల శాతం తగ్గిపోవడంతో వాతావరణంలో తేమ శాతం తగ్గి వివిధ రకాల వ్యాధులు వ్యాపించే అవకాశం పెరుగుతోందని తెలిపారు. ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతతో ముందుతరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. "కూలర్లకు నీళ్లు పోసే అలవాటుకంటే మొక్కలకు నీళ్లు పోసే అలవాటు పెంపొందించుకోవాలి" అని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

## ఢిల్లీలో జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ నియామక పత్రం స్వీకరించిన గాంగేరి శ్రీహరి.

**సంగారెడ్డి, మే 28,మన మహతి న్యూస్ :**

న్యూఢిల్లీ లోని ఇందిరా భవన్ లో నిర్వహించిన అఖిల భారత దళిత కాంగ్రెస్ సమావేశంలో సంగారెడ్డి పట్టణానికి చెందిన గాంగేరి శ్రీహరి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ నియామక పత్రాన్ని స్వీకరించారు. ఈ నియామక పత్రాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో అందుకున్నారు.



ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జాతీయ అధ్యక్షులు రాజేంద్ర పాల్ గౌతమ్, జాతీయ సలహాదారు కొప్పుల రాజు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు కవంపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ దేశంలో బీజేపీ పాలనలో దళితులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులకు జరుగుతున్న అన్యాయాలపై కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకువచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేదలు, దళితుల పక్షాన నిలబడే పార్టీ అని అన్నారు.

జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్‌గా నియమితులైన గాంగేరి శ్రీహరి మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ దళితుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

ఇట్లు,
సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ

## సదాశివపేట కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జిగా తోపాజి అనంత కిషన్ నియామకం.

**సంగారెడ్డి, మే 28,మన మహతి న్యూస్ :**





సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలను మరింత బలోపేతం చేసేందుకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. సదాశివపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయి ఇంచార్జిగా, అలాగే మున్సిపల్ వ్యవహారాల ఇంచార్జిగా తోపాజి అనంత కిషన్‌ను నియమించారు.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, పట్టణ కాంగ్రెస్ కమిటీ నియామకాల వ్యవహారాలతో పాటు పార్టీ కార్యక్రమాల నిర్వహణ, కార్యకర్తల సమన్వయం, స్థానిక ప్రజా సమస్యలపై పార్టీ చురుకైన పాత్ర పోషించేలా బాధ్యతలు నిర్వర్తించాలని అనంత కిషన్‌కు సూచించారు.

పార్టీ బలోపేతం కోసం సమిష్టిగా పనిచేయాలని పేర్కొంటూ, సమన్వయ కర్తలుగా కంబలపల్లి రాంరెడ్డి, సీడీసీ చైర్మన్ సిద్దన్న, బ్లాక్ ప్రెసిడెంట్, నియోజకవర్గ కన్వీనర్ ఆంజనేయులతో కలిసి సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సదాశివపేటలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తోపాజి అనంత కిషన్ తెలిపారు.

## నేడు గర్భిణీ మహిళలకు ఆరోగ్య పరీక్షలు

**మన మహతి.న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రేపు శుక్రవారం నారాయణపేట ఆర్డీవో కార్యాలయ సమావేశం మందిరంలో గర్భిణీలకు వైద్య నిపుణులు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రియాంక గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:40 గంటలకు ఎర్లీ చైల్డ్ డెవలప్మెంట్ కార్యక్రమం ఉంటుందని, ఆ తరువాత గర్భిణీలు, బాలింతలకు మొదటి 1000 రోజుల సంరక్షణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తారని చెప్పారు.



